ఈనాడు
తూర్పుగోదావరి
శనివారం 24 ఫిబ్రవరి 2018 16 పేజీలు

# జేఎన్టీయూకేలో నేడు టెక్‌ఫెస్ట్

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: జేఎన్టీయూకే ప్రాంగణంలో శనివారం నుంచి రెండురోజులపాటు జాతీయ స్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ట్రిపుల్‌ఈ, సివిల్, ఈసీఈ విభాగాల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వారు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.బాలకృష్ణమూర్తి అతిథి ప్రసంగం చేయనున్నారు. ఈసీఈ విభాగంలో ఐఓటీ క్లౌడ్ రోబోటిక్స్, గో సోలార్, పీసీబీ డిజైన్, సిక్స్త్ సెన్స్ రోబోటిక్స్, మొబైల్ మేకింగ్ వంటి ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారని పీఆర్వో సీహెచ్ సాయిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# 26న ఎంసెట్ నోటిఫికేషన్

## 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ

కాకినాడ, ఈనాడు: ఎంసెట్-2018 నోటిఫికేషన్‌ను ఈ నెల 26న విడుదల చేసేందుకు జేఎన్‌టీయూ కాకినాడ సన్నద్ధమైంది. ఫిబ్రవరి 28 నుంచి ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని కన్వీనర్ సీహెచ్.సాయిబాబు 'ఈనాడు'కు తెలిపారు. 30 రోజులపాటు ఎలాంటి ఆలస్యరుసుం లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆ తరువాత ఆలస్య రుసుం రూ. 500, రూ.1000, రూ.అయిదు వేలు, రూ.10 వేలు చెల్లించి కూడా దరఖాస్తు చేసుకునే వీలుంది. ఈ ఏడాది దరఖాస్తు ధరకు అదనంగా జీఎస్‌టీ కలవడంతో దరఖాస్తు రుసుంను రూ.500గా నిర్ణయించినట్లు కన్వీనర్ తెలిపారు. వచ్చే దరఖాస్తులను బట్టి ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న విషయంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. గత సంవత్సరం రీతిలోనే ఈ ఏడాది కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఎంసెట్ నిర్వహించనున్నారు.

MAIN